క్లుప్తంగా

పారదర్శకంగా ఓటర్ల జాబితా

- ఆర్డీఓ, ఎలక్టోరల్ అధికారి సత్యనారాయణ
- బూత్ స్థాయి అధికారులకు ఆదేశం

కాకినాడ రూరల్: భారత ఎన్నికల సంఘం ఆదేశాల మేరకు బూత్ స్థాయి అధికారులు క్షేత్ర స్థాయిలో పర్యటించి ఓటర్ల జాబితాను పారదర్శకంగా రూపొందించాలని కాకినాడ రూరల్ నియోజకవర్గ ఎలక్టోరల్ అధికారి, ఆర్డీఓ ఎన్వీవీ సత్యనారాయణ పేర్కొన్నారు. రమణయ్యపేటలో మండల పరిషత్ కార్యాలయ సమావేశపు మందిరంలో శనివారం నియోజవర్గ పరిధిలోని బీఎల్ఓలతో ఆయన సమీక్షించారు. నియోజకవర్గంలో 2,55,035 మంది ఓటర్లు ఉన్నారన్నారు. కరప, కాకినాడ రూరల్ మండలాలలో 264 పోలింగ్ కేంద్రాలు ఉండడంతో వాటిని బీఎల్ఓలు సందర్శించి మౌలిక వసతుల కల్పనకు చర్యలు తీసుకోవాలన్నారు. సమావేశంలో తహసీల్దారులు మురార్జీ, శ్రీనివాసరావు, ఆర్ఐలు, బూత్ స్థాయి అధికారులు పాల్గొన్నారు.

నైట్ షెల్టర్ పరిశీలన

కాకినాడ లీగల్: నిరాశ్రయులకు ఆశ్రయ కేంద్రంగా ఉన్న నైట్‌షెల్టర్‌ను మూడో అదనపు జ్యుడీషియల్ ఫస్ట్‌క్లాస్ మెజిస్ట్రేట్ డి.శ్రీదేవి శనివారం పరిశీలించారు. కాకినాడ రామారావుపేటలో ఉన్న నైట్‌షెల్టర్‌లో పడుకునే గదులు పరిశుభ్రంగా ఉన్నాయా?లేదా? నీటి సరఫరా ఉందా? లేదా ? తదితర అంశాలను ఆమె పరిశీలించారు.

అలరించిన 'స్వరాగ మాల'



సంగీత కచేరీని ప్రారంభిస్తున్న వేదిక అధ్యక్షురాలు సత్యభామ

కాకినాడ కల్చరల్: కళాకారులను ఆదుకునేందుకు ఎస్పీ బాలసుబ్రహ్మణ్యం స్మారక కళావేదిక శక్తివంచన లేకుండా కృషి చేస్తుందని వేదిక అధ్యక్షురాలు రాయవరపు సత్యభామ అన్నారు. స్థానిక సూర్యకళామందిర్‌లో ప్రపంచ సంగీత వారోత్సవాలను పురస్కరించుకొని శనివారం సాయంత్రం 'స్వరాగ మాల' పేరుతో సంగీత కచేరీ నిర్వహించారు. వేదిక అధ్యక్షురాలు సత్యభామ జ్యోతి వెలిగించి కార్యక్రమాన్ని ప్రారంభించారు. వేదిక వ్యవస్థాపక ప్రధాన కార్యదర్శి డి.రామ్‌రాజ్ మాట్లాడుతూ ఔత్సాహిక కళాకారులన ప్రొత్సహించేందుకు కృషి చేస్తున్నామన్నారు. ప్రముఖ గాయని, గాయకులు కె.సుశీల, ఆర్.ఇందు, బాబి, రమణ తదితరులు ఆలపించిన ఎస్పీ బాల సుబ్రహ్మణ్యం, ఘంటసాల సినీ గీతాలు ఆకట్టుకొన్నాయి. సాల్మన్, తిరుమలరావు తదితరులు చక్కని సంగీత సహకారం అందజేసారు. ఈ కార్యక్రమంలో డి.రామ్‌రాజ్, రామారావు, సాయి, భాస్కర్, తురగా సూర్యారావు, జానకిరామ్‌చౌదరి, శ్రీనివాసరావు, తదితరులు పాల్గొన్నారు.

యాదవ సంఘం రాష్ట్ర కార్యదర్శిగా మన్నే



కాకినాడ: అఖిల భారతీయ యాదవ మహాసభ రాష్ట్ర ప్రధాన కార్యదర్శిగా మన్నే నాగేశ్వరరావు యాదవ్ నియమితులయ్యారు. ఈ మేరకు రాష్ట్ర అధ్యక్షుడు డాక్టర్ లాకా వెంగళరావు శనివారం నియామక ఉత్తర్వులు జారీ చేశారు. గతంలో యాదవ మహాసభ కార్యదర్శిగా ఆయన క్రియాశీలకంగా వ్యవహరిస్తూ ప్రస్తుతం ఆయన కాకినాడ సూపర్‌బజార్ డైరెక్టర్‌గా, వైఎస్సార్ సీపీలోను క్రియాశీలకంగా పనిచేస్తున్నారు. ఆయనను పలువురు నాయకులు అభినందించారు.

బ్యాగ్ లాక్కుని వెళ్లిన ఆగంతకులు

కాకినాడ క్రైం: స్థానిక బుద్ధవరపువారి వీధిలో ద్విచక్రవాహనంపై వెళ్తున్న తల్లి కుమారుల నుంచి ముగ్గురు ఆగంతకులు హ్యాండ్ బ్యాగ్ లాక్కుని ఉడాయించాయి. మాస్క్ ధరించి ద్విచక్రవాహనంపై వచ్చిన ముగ్గురిలో ఇద్దరు యువకులు, ఓ యువతి ఉన్నారు. బాధితులు కాకినాడ వన్ టౌన్ పోలీసులను ఆశ్రయించారు. నిందితులు దొంగతనం చేసిన తీరును సీసీ టీవీ ఫుటేజి సేకరించిన పోలీసులు స్థానికంగా సర్క్యులేట్ చేస్తున్నారు. నంబర్ లేని పల్సర్ వాహనంపై దుండగులు మెరుపు వేగంతో వచ్చి బ్యాగ్ లాక్కెళ్లారని నిర్ధారించుకున్నారు. ఈ ఘటనపై వన్ టౌన్ సీఐ వి.కృష్ణ ఆధ్వర్యంలో పోలీస్ బృందం కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టింది.

యానాం మద్యం స్వాధీనం



స్వాధీనం చేసుకున్న మద్యం సీసాలను చూపిస్తున్న పోలీసులు

కరప: యానాంనుంచి అక్రమంగా మద్యాన్ని తరలిస్తున్న ఇద్దరు నిందితులను స్థానిక పోలీసులు అదుపులోకి తీసుని రూ.21,166 విలువచేసే సీసాలను స్వాధీనం చేసుకున్నారు. ఎస్‌ఐ నౌడు రామకృష్ణ తెలిపిన వివరాల మేరకు శనివారం రాత్రి మండలంలోని ఉప్పలంక వద్ద డ్రంక్ అండ్ డ్రైవ్‌పై నిఘా పెట్టగా యానాం వైపు నుంచి స్కూటీపై వస్తున్న అనకాపల్లి జిల్లా నక్కపల్లికి చెందిన వరుపుల బాబ్జీ, వరుపుల గాలిరాజులను నిలిపి తనిఖీ చేయగా వాహనంలో ఉన్న సీసాలను స్వాధీనం చేసుకున్నారు. కేసు దర్యాప్తు చేస్తున్నారు.

స్వయం ఉపాధికి చేయూత

- అత్తెసరు ఆదాయానికి అదనపు లబ్ధి
- మూడు విడతల్లో రూ.75 వేల ఆర్థిక సాయం
- హర్షాతిరేకాలు వ్యక్తం చేస్తున్న మహిళలు

కరప: గతంలో ఎప్పుడూలేని విధంగా రాష్ట్ర ప్రభుత్వం ప్రవేశపెట్టిన వైఎస్సార్ చేయూత పథకం పేదవర్గాల మహిళల జీవితాల్లో వెలుగులు నింపుతోంది. బతుకుతెరువుకు ఏ వ్యాపారం చేసుకోవాలన్నా గతంలో చేబదుళ్లు, ప్రైవేటు వడ్డీ వ్యాపారుల దగ్గర అప్పు చేసి వ్యాపారాలు చేసేవారు. లాభాలు దేవుడెరుగు కనీసం పెట్టుబడి వచ్చినా రాకపోయినా చక్రవడ్డీ, బారువడ్డీ చెల్లించాల్సి వచ్చేది. ఏ ప్రభుత్వమూ ఆదుకున్న పాపాన పోయేదికాదు. ఫలితంగా ఆత్మహత్యలే శరణ్యమయ్యేది. ఆటువంటి పేద వర్గాల మహిళలకు సీఎం జగన్ నేనున్నానంటూ వైఎస్సార్ చేయూత పథకం ద్వారా అండగా నిలుస్తున్నారు. 45 ఏళ్ల నుంచి 60 ఏళ్ల లోపు వయసు ఉండే ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనార్టీ వర్గాల్లోని మహిళలకు ఏడాదికి రూ. 18,750 వంతున నాలుగేళ్ల పాటు రూ.75 వేల వరకు చేయూతనిస్తున్నారు. మండల పరిధి 23 గ్రామాల నుంచి ఈ పథకానికి ఏటా మూడున్నర వేల మంది దరఖాస్తు చేసుకుంటున్నారు. ఇంతవరకూ మూడు విడతల్లో 9,921 మంది లబ్ధిపొందారు.



ఉప్పలంకలో వైఎస్సార్ చేయూతతో బడ్డీవ్యాపారం చేసుకుంటున్న దండుప్రోలు నాగరత్నం

ఎంతో మందికి ప్రయోజనం



వైఎస్సార్ చేయూత పథకం ద్వారా మండలంలో ఇంతవరకూ 10,196 మంది లబ్ధి పొందారు. 2020–21లో 3,384 మంది రూ.6,34,50,000, 2021–22లో 3,223 మంది రూ.6,04,31,250, 2022–23లో 3,589 మంది రూ.6,72,93,750 లబ్ధి పొందారు. 2023–24 ఆర్థిక సంవత్సరానికి నిధులు విడుదల కావాల్సి ఉంది.

– కె.అప్పారావు, ఎంపీడీఓ, కరప మండలం

జగనన్నకు రుణపడి ఉంటాం

నాభర్త రాంబాబు చేపల వేట సాగిస్తుంటాడు. చాలీచాలని ఆదాయం. ఏదైనా వ్యాపారం చేద్దామంటే అప్పుపుట్టని పరిస్థితి. ముఖ్యమంత్రి జగనన్న దయతో చిన్నవ్యాపారం చేసుకుంటూ జీవనోపాధి కల్పించుకుంటున్నాం. వైఎస్సార్ చేయూత పథకం ద్వారా ఆర్థిక సాయం అందిస్తున్నారు. వ్యాపారానికి పెట్టుబడిగా వాడుతున్నాం.

– దండుప్రోలు నాగరత్నం, ఉప్పులంక.

పాడిగేదెతో జీవనోపాధి

నా భర్త పెదగోవిందు కూలిపని చేస్తుంటాడు. దాంతో కుటుంబపోషణ కష్టంగా ఉంటోంది. అప్పుచేసి పాడిగేదె కొందామని వైఎస్సార్ చేయూత పథకానికి దరఖాస్తు చేసుకుంటే రూ.18,750 ఇచ్చారు. మరికొంత డబ్బుతో పాడిగేదె కొనుగోలు చేసుకున్నాం. జగనన్న మేలు ఎన్నటికీ మరువం.

– ఎండమూరి కొండమ్మ, నడకుదురు



ఒకే ఇంటిలో అధిక ఓటర్లపై విచారణ



రామకంచిరాజునగర్‌కాలనీలో ఓటర్ల వివరాలు అడిగి తెలుసుకుంటున్న తహసీల్దార్

కరప: ఒకే ఇంటి నంబర్‌లో అధిక సంఖ్యలో ఓటర్లు నమోదవడంపై అధికారులు విచారణ జరిపారు. స్థానిక 235వ పోలింగ్‌స్టేషన్ పరిధిలో 6–180 ఇంటి నంబరులో 127 మంది, 237వ పోలింగ్‌స్టేషన్ పరిధిలో రామకంచిరాజునగర్‌కాలనీలోని 10–12 ఇంటి నంబర్‌లో 150 మంది ఓటర్లు ఉండడంపై తహసీల్దార్ పి.శ్రీనివాసరావు, ఆర్ఐ పేపకాయల మాచరావు, వీఆర్వో టి.సత్యనారాయణరెడ్డి, సాయి శనివారం క్షేత్రస్థాయిలో విచారణ జరిపారు. తర్వాత వాళ్ల చిరునామా ప్రకారం ఆరా తీస్తే అందరూ ఓటర్లే కానీ, బీఎల్‌ఓలు ఓటరు జాబితా రూపొందించేటప్పుడు పొరపాటున అందరికీ ఇకే ఇంటినంబరు నమోదు చేసినట్టు అధికారులు గుర్తించారు. ఆయా ఇంటి నంబర్లతో సంబంధంలేని ఓటర్లకు ఫారమ్–8 పూర్తి చేయించి, తప్పొప్పులు సవరిస్తామని తహసీల్దార్ శ్రీనివాసరావు తెలిపారు.

చురుగ్గా జగనన్న సురక్ష సర్వే



కరపలో జగనన్న సురక్ష సర్వేను పరిశీలిస్తున్న ఎంపీడీఓ అప్పారావు

కాకినాడ రూరల్: ప్రజలకు అవసరమయ్యే సర్టిఫికెట్లను రూపాయి ఖర్చు లేకుండా ఇంటివద్దే అందజేసేందుకు వచ్చేనెల ఒకటి నుంచి రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్ఠాత్మకంగా చేపట్టనున్న జగనన్న సురక్ష కార్యక్రమంలో భాగంగా శనివారం నేమాం, గంగనాపల్లి గ్రామాల్లో అధికారులు బృందాలుగా సర్వే చేశారు. నెల రోజుల పాటు ఈ కార్యక్రమం ద్వారా 11 రకాల సేవలు ఉచితంగా అందజేసేందుకు సీఎం జగన్ మార్గదర్శకంలో అధికారులు క్షేత్ర స్థాయిలో రంగంలోకి దిగారు. తొలి రోజు నేమాం, గంగనాపల్లి గ్రామాల్లో అధికారులు, సచివాలయ సిబ్బంది, వలంటీర్లు ఇంటింటికీ వెళ్లి ప్రభుత్వం అందిస్తున్న సేవలు, వారికి కావలసిన కుల, నివాస, ఆదాయ, జనన, మరణ, తదితర ధ్రువీకరణ పత్రాలు, రేషన్ కార్డులు, వాటిలో మార్పులు చేర్పులు వివరాలు సేకరిస్తున్నారు. ప్రతి కుటుంబానికి టోకెన్ ఐడీని ఇస్తున్నారు. నేమాం గ్రామంలో తహశీల్దార్ మురార్జీ సర్వే తీరును పరిశీలించారు. ఎంపీడీఓ కర్రే స్వప్న గంగనాపల్లి గ్రామంలో సచివాలయం 1 పరిధిలో సర్వే తీరు పరిశీలించారు. జూలై 1నుంచి ప్రారంభమవుతున్న ఈ కార్యక్రమంలో భాగంగా షెడ్యూల్ ప్రకారం సభలు జరిగే గ్రామాలకు వారం ముందే సర్వే కోసం వివరాలు సేకరణకు సర్వర్లు ఓపెన్ అవుతాయన్నారు.

సమగ్రంగా సర్వే

కరప: గ్రామ వలంటీర్లు తమకు కేటాయించిన ప్రతి ఇంటికీ వెళ్లి వాళ్ల అవసరాలు గుర్తించేందుకు సమగ్రంగా సర్వే చేయాలని ఎంపీడీఓ కె.అప్పారావు సూచించారు. జగనన్న సురక్ష అమలులో భాగంగా ఇంటింట సర్వేను ఆయన గ్రామ కార్యదర్శి వి.సునీల్‌కుమార్‌తో కలసి పరిశీలించి, సూచనలు ఇచ్చారు. ఓ ఇంటిలో సర్వే పరిశీలనకు వెళ్లగా గతంలో సదరమ్ సర్టిఫికెట్ ద్వారా రూ.500 లు దివ్యాంగ పింఛన్ ఇచ్చేవారని, అది తీసేశారని, మళ్లీ ఇవ్వాలని కోరగా అంగవైకల్యం 40 శాతం ఉండటం వల్ల పింఛన్ తీసేశారని ఎంపీడీఓ అప్పారావు గృహ యజమానికి వివరించారు.



గంగనాపల్లిలోని సర్వేలో పాల్గొన్న ఎంపీడీఓ స్వప్న, పంచాయతీ కార్యదర్శి గోవిందరాజు

నగరంలో సర్వే పరిశీలన..

కాకినాడ: ప్రభుత్వ ఆదేశాల మేరకు వచ్చేనెల ఒకటో తేదీ నుంచి జగనన్న సురక్ష ప్రారంభమవుతుందని నగరపాలక సంస్థ అదనపు కమిషనర్ సీహెచ్ నాగనరసింహారావు చెప్పారు. ఈ అంశంపై శనివారం 8, 15, 22, 29, 43 సచివాలయాల పరిధిలో వలంటీర్లు ఇంటింటికీ వెళ్లి డేటా సేకరిస్తున్న విధానాన్ని ఏడీసీ పరిశీలించారు. ఈ ప్రక్రియను నూరుశాతం పూర్తయ్యేలా చర్యలు తీసుకోవాలని ఏడీసీ సూచించారు.



జగనన్న సురక్ష సర్వేను పరిశీలిస్తున్న ఏడీసీ నాగనరసింహారావు

వసతిగృహంలో జిల్లా జడ్జి తనిఖీ

కాకినాడ లీగల్: ప్రభుత్వ పీఆర్ కళాశాలలో బీసీ మహిళా వసతిగృహాలను మూడో అదనపు జిల్లా జడ్జి, మండల న్యాయసేవాధికార సంస్థ చైర్మన్ పి.కమలాదేవి శనివారం తనిఖీ చేశారు. విద్యార్థినులకు కల్పించిన వసతులు, సదుపాయాలను ఆమె పరిశీలించారు. ఈ కార్యక్రమంలో హాస్టల్ వెల్ఫేర్ అధికారి కేవీడీ మహాలక్ష్మి, అసిస్టెంట్ బీసీ అధికారి టీవీ ప్రసాద్, త్రీటౌన్ పోలీసులు పాల్గొన్నారు.



హాస్టల్‌ను పరిశీలిస్తున్న మూడో అదనపు జిల్లా జడ్జి కమలాదేవి

బాలుడి ఆచూకీ లభ్యం

కాకినాడ క్రైం: సాంబమూర్తి నగర్ ఐదో వీధికి చెందిన మూడేళ్ల బాలుడు తప్పిపోతే కేవలం రెండు గంటల వ్యవధిలో పోలీసులు అతడి ఆచూకీ గుర్తించి తల్లిదండ్రులకు అప్పగించారు. శుక్రవారం రాత్రి సీఐ కృష్ణ భగవాన్ ఆధ్వర్యంలో ప్రత్యేక బృందం బాలుడి జాడ కోసం గాలించింది. సీసీ కెమేరాలు, స్థాని కుల సమాచారం ఆధారంగా బాలుడి కదలికలు గుర్తించారు.



బాలుడిని తల్లికి అప్పగించిన పోలీసులు

భానుగుడి బస్టాప్ పునరుద్ధరణ

కరప/కాకినాడ: ఒక బస్టాప్ కోసం పోస్టు కార్డుల ఉద్యమం.. మండల సమావేశంలో తీర్మానం చేసినా పట్టించుకోని ఆర్టీసీ యాజమాన్యం ప్రభుత్వ ప్రత్యేకాధికారి, జగనన్నకు చెపుదాం, సంక్షేమ పథకాల పర్యవేక్షణాధికారి గోపాలకృష్ణ ద్వివేదికి చేసిన ఫిర్యాదుతో ఆగమేఘాలపై చకచకా ఏర్పాటు చేసేశారు. నగరంలోని భానుగుడి సెంటర్‌లో పద్మప్రియ సినిమా థియేటర్ వద్ద గతంలో ఉన్న ఈ బస్టాప్‌ను తొలగించారు. కాకినాడ నుంచి రావులపాలెం వైపు, కోటిపల్లి వైపు, యానాంవైపు, సామర్లకోట, రాజమహేంద్రవరం వైపు వెళ్లే బస్సులు ఆగేవి. ఎంతో ప్రాధాన్యం ఉన్న ఈ బస్టాప్ కోసం ఎన్ని ప్రయత్నాలు చేసిన ఎవరూ స్పందించకపోవడంతో స్థానిక మాజీ సర్పంచ్ పోలిశెట్టి తాతీలు గత నెల 31న కరపకు వచ్చిన ప్రత్యేకాధికారి గోపాలకృష్ణ ద్వివేదికి వివరించారు. ఈ మేరకు ఆయన కలెక్టర్ కృతికాశుక్లాను ఆదేశించడంతో ఆమె సూచనల మేరకు శనివారం ఆర్టీసీ అధికారులు పద్మప్రియ టాకీస్ సమీపంలో భానుగుడి సెంటర్ బస్టాప్‌ను పునరుద్ధరిస్తూ బోర్డును ఏర్పాటుచేశారు.



పద్మప్రియ టాకీస్ సమీపంలో ఏర్పాటు చేసిన బస్టాప్ బోర్డు

ఉపాధ్యాయులకు సత్కారం



ఉపాధ్యాయులను సత్కరిస్తున్న గ్రామస్తులు

కరప: గురజనాపల్లిలోని పబ్బినీడి పాపారావు జెడ్పీ ఉన్నత పాఠశాలలో బదిలీపై వెళ్లిన ఉపాధ్యాయులను శనివారం ఘనంగా సత్కరించారు. హెచ్‌ఎం బీఎస్‌వీ ప్రసాదరావు, బీఎస్ శ్రీనివాసరావు, ఎం.రామ్మోహన్, టి.హనుమంతరావు, కొత్తగా వచ్చిన హెచ్‌ఎం ఎ.సాయిమోహన్‌లను సర్పంచ్ ఎ.శ్రీనివాసరావు, ఎస్ఎంసీ చైర్మన్ పి.వీరబాబు, స్టాఫ్ సెక్రటరీ ఐ.ప్రసాదరావు, ఉపాధ్యాయులు, గ్రామస్తులు సత్కరించారు. భౌతికశాస్త్ర ఉపాధ్యాయుడిగా పనిచేస్తున్న బీఎస్ శ్రీనివాస్ హెచ్‌ఎంగా పదోన్నతిపై ప్రత్తిపాడు మండలం గజ్జనపూడి హైస్కూలుకు బదిలీ అయినట్టు ఉపాధ్యాయులు తెలిపారు.



వర్షిణిని సత్కరిస్తున్న అడబాల రత్నప్రసాద్

క్రీడాకారిణికి సన్మానం

కాకినాడ రూరల్: రమణయ్యపేట ఏపీఐఐసీ కాలనీలో అడబాల ట్రస్ట్ ఆధ్వర్యంలో జేఎన్‌టీయూకే విద్యార్థిని, థాయిలాండ్‌లో రైఫిల్ షూటింగ్‌లో రజిత పతకం సాధించిన డి.వర్షిణిని శనివారం సన్మానించారు. ముఖ్య అతిథిగా పాల్గొన్న షటిల్ క్రీడాకారుడు డాక్టర్ అద్దాల సత్యనారాయణ మాట్లాడుతూ గ్రామీణ ప్రాంతాలకు చెందిన యువతీయువకులు ఒలింపిక్ స్థాయికి క్రీడాకారులుగా ఎదగాలన్నారు. ట్రస్ట్ చైర్మన్ రత్నప్రసాద్, రేలంగి బాపిరాజు, కె.దుర్గాభవాని, తదితరులు పాల్గొన్నారు.

ఆకట్టుకుంటున్న బిజినెస్ ఎక్స్‌పో

బోట్‌క్లబ్: స్థానిక నాగమల్లితోట జంక్షన్‌లోని ద్వారంపూడి భాస్కర్‌రెడ్డి పద్మావతి కల్యాణ మండపంలో ఏర్పాటు చేసిన బీఎస్‌ఐ బిజినెస్ ఎక్స్‌పో నగర ప్రజలను ఎంతగానో ఆకట్టుకుంటోంది. ప్రదర్శనలో ఉంచిన వస్తువులు నగర ప్రజలను ఆకర్షిస్తున్నాయి. నిర్వాహకులు శ్రీకర్ మాట్లాడుతూ అందరికీ ఉపయోగపడేలా ఈ ఎక్స్‌పోలో 55 రకాలకు పైగా స్టాల్స్‌ను ఏర్పాటు చేశామన్నారు. అందరికీ అవసరమైన హోమ్ డెకార్స్, కన్‌స్ట్రక్షన్, రియల్ ఎస్టేట్, గోల్డ్ జ్యూయలరీ, గార్మెంట్, కంప్యూటర్స్, ఆటోమొబైల్స్ స్టాల్స్‌ను ఈ ప్రదర్శనలో ఉంచామన్నారు. ఆదివారం రాత్రి 9 గంటలు వరకూ ఈ ప్రదర్శన ఉంటుందన్నారు.



ఎక్స్‌పోను తిలకిస్తున్న నల్లమిల్లి శేషారెడ్డి

అంతర్ కళాశాల క్రీడల్లో ఆర్ఎంసీ ప్రతిభ

నాగమల్లితోట జంక్షన్ (కాకినాడ సిటీ): నెల్లూరు నారాయణ మెడికల్ కళాశాలలో ఇటీవల జరిగిన డాక్టర్ వైఎస్సార్ హెల్త్ యూనివర్సిటీ అంతర్ కళాశాల క్రీడల్లో కాకినాడ ఆర్ఎంసీ విద్యార్థులు ప్రతిభ కనబరచినట్టు కళాశాల పీడీ డాక్టర్ కె.స్వర్ణన్‌రాజు శనివారం తెలిపారు. కళాశాలలో శనివారం ఏర్పాటు చేసిన కార్యక్రమంలో ప్రిన్సిపాల్, డీఎంఈ డాక్టర్ నర్సింహం మాట్లాడుతూ ఆర్ఎంసీ విద్యార్థులు వివిధ విభాగాల్లో రన్నర్స్‌గా నిలిచారన్నారు. త్వరలో జరిగే అంతర్ వర్సిటీ పోటీల్లో ప్రతిభను కనపరిచి పతకాలు సాధించాలన్నారు. స్వర్ణన్‌రాజు మాట్లాడుతూ ఆర్ఎంసీ విద్యార్థులు బాస్కెట్‌బాల్, చెస్, షటిల్ బ్యాడ్మింటన్, వాలీబాల్, ఫుట్‌బాల్‌లో రన్నర్స్‌గా నిలిచారన్నారు. విజేతలను, పీడీ స్వర్ణన్ రాజును కళాశాల వైస్ ప్రిన్సిపాల్ డాక్టర్ విష్ణువర్ధన్, స్పోర్ట్స్ ఉపాధ్యక్షులు దేవి మాధవి, స్పోర్ట్స్ కో–ఆర్డినేటర్ లక్ష్మన్‌రెడ్డి అభినందించారు.



విజేతలతో కళాశాల ప్రిన్సిపాల్ నర్సింహం తదితరులు

సేవ్ ద నేమ్

- 'నా కాకినాడ–మన కాకినాడ' పేరుతో పచ్చబ్యాచ్‌పై ప్రచారోద్యమం
- ఎమ్మెల్యే ద్వారంపూడి శ్రీకారం

కాకినాడ: అత్యంత నివాసయోగ్యమైన నగరాల్లో దేశంలో నాలుగో స్థానాన్ని సాధించి పెన్షనర్స్ పేరడైజ్‌గా, రెండో మద్రాస్‌గా పేరున్న కాకినాడ ప్రతిష్ఠను దిగజార్చేలా పచ్చబ్యాచ్ చేస్తున్న దుష్ప్రచారంపై 'నా కాకినాడ–మన కాకినాడ' పేరుతో ప్రజలను చైతన్యవంతం చేయాలని ఎమ్మెల్యే ద్వారంపూడి నిర్ణయించారు. ఆ మేరకు త్వరలో కాకినాడలో 'నా కాకినాడ–మన కాకినాడ' పేరుతో స్టిక్కర్లు, కరపత్రాలు, హోర్డింగ్‌లు, ప్రచారాల ద్వారా ప్రజలను చైతన్యవంతం చేయాలని ఎమ్మెల్యే ద్వారంపూడి సంకల్పించారు. ఆ మేరకు శనివారం తన కార్యాలయంలో పార్టీ ముఖ్యనేతలతో చర్చించి ఈ నిర్ణయం తీసుకున్నారు. గడచిన కొద్ది రోజులుగా జనసేన అధినేత పవన్‌కల్యాణ్, టీడీపీ అధినేత చంద్రబాబు, టీడీపీ మాజీ ఎమ్మెల్యే వనమాడి కొండబాబు పథకం ప్రకారం చేస్తున్న దుష్ప్రచారంతో కాకినాడ ప్రతిష్ఠకు అంతర్జాతీయంగా భంగం కలిగే పరిస్థితి ఏర్పడింది.



అన్ని వర్గాలు మేల్కొనాలి

కాకినాడకు ఉన్న పేరుప్రతిష్ఠలు మంటగలసిపోకుండా రాజకీయాలకు అతీతంతంగా మేధావులంతా స్పందించాలని ఎమ్మెల్యే ద్వారంపూడి చంద్రశేఖరరెడ్డి పేర్కొన్నారు. కాకినాడలో పుట్టి పెరిగిన ప్రతి పౌరుడు ఎక్కడ ఉన్నా ప్రస్తుత పరిణామాలపై స్పందించాలన్నారు. రాజకీయ ప్రయోజనాల కోసం టీడీపీ, జనసేన వంటి పార్టీలు చేసే దుష్ప్రచారాల వల్ల భావి తరాలకు తీవ్ర నష్టం కలగడంతో పాటు, మన ప్రాంతం ఎంతో నష్టపోతుందని, అందుకే ప్రతి ఒక్కరిలో 'మా కాకినాడ–మన కాకినాడ' అనే ఫీల్‌తో స్పందించాల్సిన అవసరం ఉందని ఎమ్మెల్యే పేర్కొన్నారు.

బీసీల ఆత్మగౌరవ సభ వాయిదా

కాకినాడ: కాకినాడ సూర్యకళామందిరంలో ఆదివారం జరగాల్సిన బీసీల ఆత్మగౌరవ సభ వాయిదా వేసినట్టు మాజీ మంత్రి మల్లాడి కృష్ణారావు తెలిపారు. శనివారం ఆయన బీసీ ఫెడరేషన్ నాయకులతో కలసి ఆయన విలేకర్లతో మాట్లాడుతూ అనివార్య కారణాల వల్ల వాయిదా వేసిన ఈ సభను వచ్చే నెల 16వ తేదీకి వాయిదా వేసినట్టు వివరించారు. కాకినాడతో పాటు రాష్ట్రంలోని వివిధ ప్రాంతాల్లో ఈ సభలు నిర్వహించి బీసీ కుల గణన, రిజర్వేషన్లు, పదోన్నతులు, హక్కులపై చర్చించి ప్రభుత్వానికి నివేదిస్తామన్నారు.

బైక్ ర్యాలీ వాయిదా

బీసీల సంక్షేమానికి సీఎం జగన్, ఎమ్మెల్యే ద్వారంపూడి చేస్తున్న కృషికి మద్దతుగా ఆదివారం కాకినాడలో తలపెట్టిన బైక్ ర్యాలీ వాయిదా వేసినట్టు వైఎస్సార్ సీపీ ఉభయగోదావరి జిల్లాల బీసీ సెల్ సమన్వయ కర్త అల్లి రాజబాబు, ఉమ్మడి తూర్పుగోదావరి జిల్లా బీసీ సంక్షేమ సంఘ అధ్యక్షులు పంపన రామకృష్ణ ఒక ప్రకటనలో తెలిపారు. వర్షం కారణంగా ర్యాలీ వాయిదా పడిందన్నారు. ర్యాలీ తిరిగి ఎప్పుడు నిర్వహించేది త్వరలోనే ప్రకటిస్తామన్నారు.

రైతు బజార్ల ద్వారా మెరుగైన సేవలు

- మార్కెట్ కమిటీ చైర్మన్ వెంకటలక్ష్మి



రైతుబజార్‌లో పర్యటిస్తున్న వ్యవసాయ మార్కెట్ కమిటీ చైర్మన్ వెంకటలక్ష్మి

కాకినాడ: రైతు బజార్ల ద్వారా కొనుగోలుదారులకు మరిన్ని మెరుగైన సేవలు అందించేందుకు కృషి చేస్తానని కాకినాడ వ్యవసాయ మార్కెట్ కమిటీ చైర్మన్ పసుపులేటి వెంకటలక్ష్మి చెప్పారు. చైర్మన్ హోదాలో ఆమె తొలిసారిగా ఆర్టీసీ కాంప్లెక్స్, గాంధీనగర్ రైతు బజార్లను సందర్శించి నాణ్యమైన కూరగాయలు, ఇతర వస్తువులను సరసమైన ధరలకు ప్రజలకు అందించాలని రైతులు, వ్యాపారులకు సూచించారు. ఆమె వెంట మార్కెట్ కమిటీ వైస్ చైర్మన్ ధోణీ చిట్టిబాబు, ఎస్టేట్ అధికారులు కృష్ణారావు, గోవిందరాజులు, శివ, డైరెక్టర్లు ఉన్నారు.

ఐపీటీవీలను ఉచితంగా ఇవ్వండి

కాకినాడ క్రైం: ఏపీ ఫైబర్ నెట్ వినియోగదారులకు ఐపీటీవీ (ట్రిపుల్ ప్లే సెట్ అప్ బాక్స్)లను ప్రభుత్వం ఉచితంగా అందించాలని ఫైబర్ నెట్ ఆపరేటర్స్ ఫెడరేషన్ నాయకులు శనివారం రాష్ట్ర ఫైబర్ నెట్ లిమిటెడ్ ఎండీ ఎం.మధుసూదన రెడ్డికి లేఖ రాశారు. అతి తక్కువ ధరకు నెట్ సేవలు అందించాలనే ప్రభుత్వ సంకల్పానికి బాక్సులను ఉచితంగా ఇవ్వాలనే నిర్ణయం ఊపిరి పోస్తుందన్నారు. దేశానికే ఆదర్శంగా నిలిచిన నవరత్నాలు వంటి పథకాలతో పాటు ఇతర ప్రభుత్వ పథకాలు, ప్రజలకు అందిస్తున్న ప్రయోజనాలు, సమాచారాన్ని ప్రజలకు ఏపీ ఎస్ఎఫ్ఎల్ మాత్రమే అందించగలదనీ, కార్పొరేట్ అనుసంధానాలపై సాధ్యం కాదని వివరించారు.

30న వామపక్షాల ఆందోళన

కాకినాడ సిటీ: విద్యుత్ ఛార్జీల భారాలు రద్దు చేయాలని, ప్రీపెయిడ్ స్మార్ట్ మీటర్లు ఉపసంహరించుకోవాలని సీపీఎం రౌండ్ టేబుల్ సమావేశం ప్రభుత్వాన్ని కోరింది. శనివారం సుందరయ్యభవన్‌లో కె.సత్తిరాజు అధ్యక్షతన నిర్వహించిన సమావేశంలో ఈ మేరకు ఈ నెల 30వ తేదీన ఆయా విద్యుత్ కార్యాలయాల వద్ద ఆందోళన చేయనున్నట్టు నాయకులు పేర్కొన్నారు. సమావేశంలో నాయకులు అయితాబత్తుల రామేశ్వరరావు, ఒమ్మి బాలాజీ పాల్గొన్నారు.